RNI No: TELTEL/2022/83798

www.aksharavelugu.com

# అక్షర వెలుగు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : పృధ్విరాజ్.జి

బుధ వారం 24. 12 .2025 | పేజీలు - 04 | సంపుటి - 04 | వెల రూ. 5 | సంచిక- 340

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



**హెచ్-1బీ వీసా ఎంపిక ప్రక్రియలో కీలక మార్పులు**

ఉద్యోగుల జీతాల ఆధారంగా ప్రాధాన్యం

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్

## కెసిఆర్ రాకతో సర్కార్‌లో వణుకు

➤అర్ధరాత్రి వరకు మీటింగ్‌లు..సమీక్షలు
➤సిఎం రేవంత్‌కు సచివాలయ వాస్తు భయం
➤అందుకే సచివాలయానికి రావడం లేదు
➤బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు



హైదరాబాద్,డిసెంబర్23(అక్షర వెలుగు): కేసీఆర్ మీడియా ముందుకు వచ్చిన తర్వాత 3వ

## యూరియా కోసం యాప్ ద్వారా బుకింగ్

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
గ్రామాల వారీగా సమావేశాల ద్వారా చైతన్యం



నిజామాబాద్,డిసెంబర్23(అక్షరవెలుగు): రైతులకు యూరియా ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల బుకింగ్ యాప్‌ను ప్రతి రైతు తప్పనిసరిగా వినియోగించాలని, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన 3వ

## 2026 సంవత్సర క్యాలెండర్, డైరీ

ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు నాయుడు



అమరావతి,డిసెంబర్23(అక్షరవెలుగు): ఏపీ అసెంబ్లీ సెక్రటేరియట్ రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్, డైరీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం ఆవిష్కరించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమక్షంలో 3వ

## కాంగ్రెస్‌ది పక్కా మాఫియా పాలన

- చెక్‌డ్యామ్‌లను కూల్చేస్తున్న ఇసుక మాఫియా
- ప్రభుత్వ కనుసన్నల్లోనే ఈ వ్యవహారం
- మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్



హైదరాబాద్,డిసెంబర్23(అక్షరవెలుగు): తెలంగాణలో నడుస్తోంది ప్రజా పాలన కాదు.. పక్కా మాఫియా పాలన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నాడు ఎన్నికల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు మీద బాంబులు వేశారని.. నేడు ఇసుక మాఫియా కోసం ఏకంగా చెక్ డ్యామ్‌ల మీద జెలటిన్ స్టిక్స్‌తో బాంబులు వేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వాటర్ మ్యాన్ రాజేంద్ర సింగ్ ఇది మానవ నిర్మిత విధ్వంసం అని మొత్తుకుంటున్నా, ఈ 'చిట్టి నాయుడి' ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని అన్నారు. డ్రిల్లింగ్ 4వ

## ఉప్పల్ ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం

### వెల్డింగ్ చేస్తుండగా చెలరేగిన మంటలు

కాలిబూడిదైన కర్మాగారం




హైదరాబాద్,డిసెంబర్23(అక్షరవెలుగు): ఉప్పల్‌లో మంగళవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. లిమ్రా ఫర్నిచర్ అండ్ సోఫా వర్క్‌షాప్‌లో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. వెల్డింగ్ పనులు జరుగుతున్న సమయంలో ఏర్పడిన స్పార్క్ ఫోమ్‌ను తాకడంతో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. వర్క్‌షాప్‌లో ఫర్నిచర్ తయారీకి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వెలువడిన స్పార్క్ ఫోమ్ కలపను తాకడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఫర్నిచర్ వర్క్‌షాప్‌లో అధికంగా ఉండే ఫోమ్, ప్లైవుడ్, కెమికల్ కోటింగ్ పదార్థాలతో మంటలు మరింత వేగంగా వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలు ఇతర భవనాలకు వ్యాపించకుండా నియంత్రించారు. కొంతసేపటి తర్వాత మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో లిమ్రా ఫర్నిచర్ అండ్ సోఫా వర్క్‌షాప్‌కు భారీగా నష్టం జరిగింది. అయితే, నష్టం విలువ ఎంత అన్నది అధికారికంగా ఇంకా వెల్లడించలేదు.÷రిద్ది రోజుల్లోనే షాప్ ఓపెనింగ్ చేయాలనుకున్నామని.. అంతలోనే ఇంత పెద్ద ప్రమాదం జరిగిందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించే విషయం. వెల్డింగ్ పనులు చేస్తున్న కార్మికులు కూడా సురక్షితంగా బయటపడినట్లు సమాచారం. ఈ ఘటనపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో హైదరాబాద్ నగరంలోని ఫర్నిచర్ వర్క్‌షాపులు, చిన్న పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రత్యేకంగా ఫోమ్, కెమికల్స్, వెల్డింగ్ వర్క్ ఉన్న చోట్ల అగ్ని ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తెలంగాణకు స్పష్టమైన విజన్ తెలంగాణ రైజింగ్

### అన్ని శాఖలకు సంబంధించి పాలసీ

అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు తరలించండి◆అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచనలు



హైదరాబాద్,డిసెంబర్23(అక్షరవెలుగు): ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం. కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక పాలసీ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. అందుకే ముఖ్యమైన విభాగాలకు ఒక పాలసీని తీసుకున్నాం. రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశామన్నారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్పష్టమైన విధి విధానాలతో మేము ముందుకు వెళ్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆయా శాఖల్లో పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. శాఖల మధ్య సమన్వయంపై కీలక సూచనలు చేశారు. ప్రతీ సెక్రటరీ వారి వారి శాఖల్లో ఉన్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు జనవరి 26వ తేదీలోగా సీఎస్‌కు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల హోచ్‌వోడీలు వెరిఫై చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. పక్రియను జనవరి 26వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. జనవరి 26వ తేదీలోపు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. '

## సర్పంచ్‌లకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు

పంచాయితీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష



హైదరాబాద్,డిసెంబర్23(అక్షరవెలుగు): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటింది. ఈ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు.. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంచి పాలన అందించి, పంచాయతీలను ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుతారని.. మీరంతా ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వారందరికీ సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో.. నవంబర్ 11, 14, 17 తేదీల్లో జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుని అగ్రస్థానంలో నిలిచింది. మూడు దశల్లో మొత్తం 6821 స్థానాల్లో గెలుపొందింది. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ 3520 స్థానాలను కైవసం చేసుకుంది. బీజేపీ 703 స్థానాల్లో గెలిచింది. ఇతరులు 1654 స్థానాలను గెలుచుకున్నారు.

## కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీలో విషాదం

సర్పంచ్ కారు కిందపడి బాలిక మృతి

ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన



వికారాబాద్,డిసెంబర్23(అక్షరవెలుగు): వికారాబాద్ జిల్లాలో కాంగ్రెస్ సర్పంచ్ విజయోత్సవ ర్యాలీలో విషాదం నెలకొంది. పోడూరు మండలం రాకంచర్ల గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ కమ్లిబాయ్ నిర్వహించిన ర్యాలీలో ఏడేళ్ల చిన్నారిపై నుంచి కారు వెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలిక దుర్మరణం చెందింది. వివరాల్లోకి వెళ్తే.. సర్పంచ్‌ల ప్రమాణస్వీకరం సోమవారం నాడు పూర్తి కావడంతో రాకంచర్ల గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ కమ్లిబాయ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పర్మిషన్ లేకున్నా డీజేతో ర్యాలీ ఏర్పాటు చేశారు. ఆ ర్యాలీని చూస్తున్న సమయంలోనే ఏడేళ్ల చిన్నారి కుర్వా సౌజన్యపై నుంచి సర్పంచ్ కారు వెళ్లింది. కారు చక్రాల కింద నలిగి తీవ్ర గాయాలు కావడంతో బాలికను హుటాహుటిన పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది.

## కెటిఆర్, హరీష్‌లకు నోటీసులంటూ లీకులు

లీకు వీరుడు రేవంత్ అంటూ జగదీశ్ రెడ్డి విమర్శలు



నల్లగొండ,డిసెంబర్23(అక్షరవెలుగు): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, సీనియర్ నేత హరీష్ రావుకు నోటీసులు ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి లీకులు ఇవ్వడంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇస్తామని రేవంత్ రెడ్డి లీకు ఇచ్చిండని జగదీశ్‌రెడ్డి చెప్పారు. వాడు ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి రోజు నుంచి ఫోన్ ట్యాపింగ్ గురించి ఏడుస్తున్నాడని మాజీ మంత్రి విమర్శించారు. కరెంట్ గురించి ఇలాగే ఏడ్చిండని, దానికి సంబంధించిన రిపోర్టు రాగానే సిగ్గుతో మడిచి కనబడని చోట పెట్టుకున్నడని అన్నారు. 'కేసీఆర్ మల్లెపూవు లాగ ఉన్నాడురా.. కాంగ్రెస్, బీజేపీల కంటే గొప్పగా 24 గంటలు కరెంట్ ఇచ్చిండు' అని రిపోర్టులో వచ్చిందని ఆయన గుర్తుచేశారు. కాళేశ్వరం మీద కూడా రేవంత్ ఏడ్చిండని, కానీ కోర్టు దాన్ని రిపేర్ చేయిరా అని చెప్పిందని అన్నారు.

## గర్భిణిపై దాడిచేసిన వ్యక్తి అరెస్ట్

శ్రీసత్యసాయి,డిసెంబర్23(అక్షరవెలుగు): శ్రీసత్యసాయి జిల్లా ముత్యాలవాండ్లపల్లిలో గర్భిణిపై దాడి చేసిన వైకాపా కార్యకర్త అజయ్‌దేవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని కదిరి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా నడిపించుకుంటూ పీఎస్‌కు తీసుకెళ్లారు. జగన్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ముత్యాలవాండ్ల పల్లిలో వైకాపా పార్టీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. గ్రామంలో కేకు కోసి, బాణసంచా కాలుస్తూ అరుపులు, కేకలతో హంగామా చేశారు. గ్రామానికి చెందిన ఏడునెలల గర్భిణి సంధ్యారాణి ఇంటివద్ద పదేపదే బాణసంచా కాల్చడంతో.. శబ్దాలతో ఇబ్బందిగా ఉందని, పక్కకు వెళ్లి కాల్చుకోండని ఆమె చెప్పారు. దీంతో వైకాపా నాయకులు కోపంతో ఊగిపోయారు. ఆ పార్టీ కార్యకర్త అజయ్‌దేవ్ ఆమెపై దాడిచేశాడు. గర్భిణి అన్న కనికరం కూడా లేకుండా ఆమె జుట్టు పట్టుకుని లాగి, కడుపుపై కాలితో తన్ని గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. మంగళవారం అజయ్‌దేవ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడిని రిమాండ్‌కు పంపనున్నట్లు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు.

# దమ్ముంటే సహకార ఎన్నికలు నిర్వహించండి

**నామినేటెడ్ పద్ధతిలో భర్తీకి సర్కార్ యత్నం● ఓటు వేసే సమయమొస్తే రైతులు కర్రుకాల్చి వాతలకు సిద్ధం● నల్లగొండలో సర్పంచ్‌ల తో సమావేశంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్**



నల్లగొండ,డిసెంబర్23(అక్షరవెలుగు): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన '420' హామీలను అమలు చేయలేక, ప్రజలకు ముఖం చూపించలేక సహకార ఎన్నికల నిర్వహణ నుంచి తప్పించుకుంటోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సర్కారు నామినేటెడ్ పద్ధతిలో 'సహకార' పదవులు నింపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు ఓటేసే అవకాశం ఇస్తే కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయయని అన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలను కూడా ప్రభుత్వం భయంతోనే వాయిదా వేస్తోందని విమర్శించారు.నల్లగొండ జిల్లాలో సర్పంచులు, వార్డు మెంబర్‌ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కార్యకర్తలకు దిశానిర్దేశంచేస్తూ.. అర్జునుడు చిలుక కన్నును లక్ష్యంగా చేసుకున్నట్టు.. మన దృష్టి కూడా కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుపైనే ఉండాలని కేటీఆర్ సూచించారు. ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా భయపడేది లేదని, నల్లగొండ, మహబూబ్‌నగర్ రైతాంగానికి న్యాయం జరిగే వరకు మన పోరాటం ఆగవద్దని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా మంత్రులకు సాగునీటిపై కనీస అవగాహన లేదని, అబద్దాలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా ప్రభుత్వానికి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లాలో జరిగిన సర్పంచులు, వార్డ్ మెంబర్‌ల అభినందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. పాలమూరు-రంగారెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తిచేస్తే.. మిగిలిన 10 శాతం పనులను కూడా ఈ ప్రభుత్వం పూర్తిచేయలేదని విమర్శించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ గర్జిస్తున్నారని, ఆయన గర్జనకు సమాధానం చెప్పలేక, ప్రజల దృష్టిని మళ్లించడానికి కేసుల పేరుతో నిరాధారమైన లీకులు ఇస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నిజంగానే మేలుచేసి ఉంటే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేదని, కానీ ఓటమి భయంతో ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని విమర్శించారు. నామినేటెడ్ పద్ధతిపై ఆయన ధ్వజమెత్తారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను చూసి భయంతో ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లడంలేదని, నామినేటెడ్ పద్ధతిలో పదవులను భర్తీ చేస్తూ కాలక్షేపం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలు పెడితే రైతులు తగిన బుద్ధి చెబుతారనే భయం ముఖ్యమంత్రిలో ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయదారులు, కూలీలు ప్రభుత్వంపై తీవ్ర కోపంతో ఉన్నారని, ఆ ప్రభావం ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. రైతుబంధు, కౌలు రైతులకు ఆర్థిక సాయం, రైతు కూలీలకు నెలకు వెయ్యి రూపాయల భరోసా వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కేసీఆర్‌పై నిరాధారమైన కేసుల లీకులు ఇస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే.. రైతులకు మంచి చేశామన్న నమ్మకం ఉంటే.. సహకార ఎన్నికలు పెట్టాలని సవాల్ విసిరారు. ఎన్నికల నుంచి కాంగ్రెస్ ఎన్ని రోజులు తప్పించుకున్నా, ప్రజాక్షేత్రంలో ఆ పార్టీని నిలదీయడం ఖాయమని కేటీఆర్ స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపట్ల చిత్తశుద్ధితో ఉంటే వెంటనే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ కేవలం కాలక్షేప రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రికి దమ్ముంటే, కేసుల గురించి వెనుక నుండి లీకులు ఇవ్వడం మానేసి, నేరుగా కెమెరా ముందుకు రావాలని, ఏ కేసు పెడుతున్నారో చెప్పాలని సవాల్ విసిరారు. హోంమంత్రి కూడా ఆయనే కాబట్టి ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని, శిఖండి రాజకీయాలు చేయడం తగదని విమర్శించారు. ప్రజా ప్రయోజనాలకంటే కేవలం కేసుల చుట్టూనే ప్రభుత్వాన్ని తిప్పుతున్నారని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, భూపాల్ రెడ్డి, రవీంద్ర కుమార్ నాయక్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితోపాటు మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్, నాయకులు చెరుకు సుధాకర్, ఒంటెద్దు నరసింహారెడ్డి, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.

## పివి సేవలు చిరస్మరణీయం

**నివాళి అర్పించిన కెటిఆర్**



హైదరాబాద్,డిసెంబర్23(అక్షరవెలుగు): నవభారత నిర్మాత, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహా రావు భారతదేశానికి గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. భారత ప్రధానిగా, ఆర్థికవేత్తగా, రాజనీతిజ్ఞుడిగా, సంస్కరణశీలిగా, బహుభాషా కోవిదుడిగా భారతరత్న పీవీ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన నివాళు లర్పించారు. ఆధునిక భారత నిర్మాణానికి బాటలు వేస్తూ.. పీవీ నరసింహా రావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు చరిత్రాత్మకమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత.. పీవీ నరసింహా రావును బీఆర్ఎస్ ప్రభుత్వం సముచితంగా గౌరవించిందని గుర్తుచేశారు. పీవీ నరసింహా రావు శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందని.. నెక్లెస్ రోడ్‌కి, వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టింది.. వారి విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. పీవీ నరసింహా రావుకి భారతరత్న ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం పంపిందన్నారు. పీవీ కూతురిని ఎమ్మెల్సీగా గౌరవించిందన్నారు.

## కృష్ణా నదీ జలాలపై అవగాహనా రాహిత్యం

**సిఎం సహా మంత్రులకు జీరో నాలెడ్జ్**

**ఉత్తమ్ కుమార్ రెడ్డికి అసలు విషయమే తెలియదు**

**నల్లగొండ పర్యటనలో కెటిఆర్ విమర్శలు**



నల్లగొండ,డిసెంబర్23(అక్షరవెలుగు): కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై, రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల అజ్ఞానంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నల్లగొండ జిల్లా వేదికగా సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి నదీ జలాల అంశంపై ఎలాంటి అవగాహన లేదని విమర్శించారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులపై కేటీఆర్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీళ్లపై కనీస అవగాహన లేదని విమర్శించారు. ఇటీవల జరిగిన ఒక మీడియా సమావేశంలో నీళ్ల గురించి అడిగిన ప్రశ్నలకు 'నేను ప్రిపేరయ్యి రాలేదు, రేపు వచ్చి సమాధానం చెప్తా' అని తప్పించుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. మరో మంత్రి గురించి చెబుతూ 'వాటర్‌లో నీళ్లు' అని మాట్లాడే అజ్ఞాని అంటూ ఎద్దేవా చేశారు. ప్రజల కష్టాలు, సాగునీటి అవసరాలు తెలియని వాళ్లు అడ్డదారిలో అధికారంలోకి వచ్చి హూంకరిస్తున్నారని, అబద్దాలు చెప్పి గందరగోళం సృష్టించడం తప్ప వారికి ప్రజలపట్ల చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం కేసీఆర్ గర్జిస్తుంటే, దానికి సమాధానం చెప్పే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి కీలక ప్రాజెక్టులను ఈ ప్రభుత్వం అశ్రద్ధ చేస్తోందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి గత ప్రభుత్వం 90 శాతం పనులు పూర్తి చేస్తే.. మిగిలిన 10 శాతం పనులను కూడా పూర్తిచేయలేక ఈ రెండేళ్లుగా కాలయాపన చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. డీపీఆర్ (ఆఖఖీ) పంపడంలో విఫలమవడమే కాకుండా, ప్రాజెక్టుల పరిధిని కుదిస్తూ తెలంగాణ ప్రయోజనాలకు గండికొడుతున్నారని విమర్శించారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రైతాంగానికి కృష్ణా జలాల్లో న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. సాగునీటి అంశంపై కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం తడబడుతోందని, ప్రజల దృష్టిని మళ్లించడానికి బెదిరింపులకు దిగుతోందని కేటీఆర్ ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

## చెక్‌డ్యామ్‌లు కూలాయా..కూల్చివేశారా ?

**అంతుచిక్కని చెక్‌డ్యామ్‌ల విధ్వంసం□పరస్పర విమర్శలతో అసలు సమస్య పక్కకు**

కరీంనగర్,డిసెంబర్23(అక్షరవెలుగు): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మానేరు పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాలు పెంచడంతోపాటు రైతులకు సాగునీరు ఇచ్చేందుకు గతంలో నిర్మించిన చెక్ డ్యామ్‌లు కూలిపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. బీఆర్ఎస్ హయాంలో వందల కోట్లు ఖర్చుచేసి నిర్మించిన ఈ చెక్‌డ్యామ్స్ ద్వారా దాదాపు 10 వేల ఎకరాల్లో సాగునీటికి ఢోకా లేకుండా పోయింది. కానీ ఇప్పుడు వాటి ఉనికే ప్రశ్నార్ధకం కావడం ఆందోళన కలిగిస్తోంది. చెక్ డ్యామ్స్ వరుసగా కూలిపోతుండటం హాట్ టాపిక్‌గా మారింది. నవంబర్‌లో గుంపుల-తనుగుల గ్రామాల మధ్య ఉన్న చెక్ డ్యామ్ రాత్రికి రాత్రే కొట్టుకుపోయిన ఘటన కలకలం రేపింది. తిరిగి రెండ్రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవి సోమన్‌పల్లి శివార్లలో మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యాం పూర్తిగా ధ్వంసమైపోయింది. ఈ రెండిటి ఆధారంగా వందల ఎకరాలు సాగవుతున్నాయి. ఉన్నట్టుండి రెండూ కొట్టుకుపోవడంతో చుట్టుపక్కల రైతాంగానికి తీరని నష్టం జరుగుతోంది. ఆ నష్టం ఒక ఎత్తయితే? అసలు ఉన్నట్టుండి ఈ చెక్ డ్యామ్‌లు ఎందుకు కొట్టుకుపోతున్నాయి? ప్రమాద వశాత్తు అలా జరుగుతోందా? లేక పనిగట్టుకుని ఎవరైనా కూల్చేస్తున్నారా అన్న ప్రశ్నలకు ప్రస్తుతానికి సమాధానం దొరకడం లేదు. నిజానికి వరుసగా కుప్పకూలే అవకాశం లేదు. దీంతో ఇప్పుడీ ఘటను రాజకీయంగా వేడి రాజేస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల పరస్పర విమర్శలు పెంచేస్తున్నాయి. చెక్ డ్యామ్‌లు కూలిన విషయం తెలిసిన వెంటనే కాంగ్రెస్ నేతలు అక్కడకు వెళ్లి పరిశీలించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేయించిన నాసిరకం పనులు, అనాలోచిత చర్యల వల్లే చెక్ డ్యామ్ కూలిందని ఆరోపించారు. దాంతో బీఆర్ఎస్ నేతలు క్షేత్రస్థాయికి వెళ్లి అధికార పార్టీపై ఎదురుదాడి మొదలు పెట్టారు. తనుగుల దగ్గర కూలిన చెక్ డ్యామ్ దగ్గరికి మాజీ మంత్రులు హరీష్, గంగుల వెళ్లి ఇసుక మాఫియా కోసమే బాంబులు పెట్టి పేల్చివేశారని ఆరోపించారు. అది కూలిపోయిందా పేల్చివేశారా అన్న చర్చలు, విచారణలు జరుగుతుండగానే అడవి సోమన్ పల్లి వద్ద ఉన్న చెక్ డ్యామ్ కొట్టుకుపోవడం ఇంకా సంచలనమైంది. అడవి సోమన్ పల్లి విచారణకు బీఆర్ఎస్ నిజ నిర్ధారణ బృందాన్ని పంపింది. నీటిపారుదల నిపుణులు, బీఅరెస్ నేతలతో కూడిన ఆ టీమ్ శనివారం అక్కడకు చేరుకుని చెక్ డ్యామ్ కూలిపోలేదని కూల్చివేశారని ప్రకటించింది. దానికి తోడు ఆదివారంనాడు మీడియాతో మాట్లాడిన కేసీఆర్ కూడా చెక్ డ్యామ్‌లను బాంబులు పెట్టి పేల్చివేస్తారా?? ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తారా..? మేం అధికారంలోకి రాగానే దోషులు పాతాళంలో ఉన్నా పట్టుకు వస్తామంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసలు చెక్ డ్యామ్‌ల చుట్టూ ఏం జరుగుతోందన్న చర్చలు నడుస్తున్నాయి. లక్షలాది క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు కూడా చెక్కుచెదరకుండా ఉన్న చెక్ డ్యామ్స్ ఉన్నట్టుండి, అదీ కూడా ఎలాంటి వరదలు లేని టైంలో ఎలా కొట్టుకుపోతాయని ప్రశ్నిస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. ఇసుక మాఫియా కోసం అధికార పార్టీ నేతలే ఇలాంటి దుశ్చర్యలకు పాలడ్డారంటూ విమర్శలు మొదలుపెట్టారు. బాంబులు పెట్టి పేల్చారంటూ ప్రతిపక్ష నేతలు పదే పదే ప్రస్తావించడం అధికార పార్టీకి కాస్త ఇబ్బందిగానే మారింది. నాణ్యతాలోపం వల్లే కూలిందని తొలుత ప్రకటించిన కారణంగా ఇప్పుడు ఆత్మరక్షణలో పడ్డామన్న అభిప్రాయం పెరుగుతోంది. లోకల్ లీడర్స్ తొందరపాటు వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని హస్తం క్యాంపులో చర్చలు సాగుతున్నాయి. కోట్లాది రూపాయలతో నిర్మించిన చెక్ డ్యామ్‌లు కూలిపోయాయా.. లేక కూల్చివేశారా..? అనేది తేల్చాల్సింది ప్రభుత్వమే. ఇందుకు కారణమైన వారిని పట్టుకుని శిక్షించాల్సిదే.

## జనవరి 2 నుంచి టోకెన్లు లేకున్నా దర్శనానికి అనుమతి



తిరుమల,డిసెంబర్23(అక్షరవెలుగు): వైకుంఠద్వార దర్శన ఏర్పాట్ల కోసం రెండు నెలలుగా పనిచేస్తున్నామని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా ప్రభుత్వం సబ్‌కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్‌పై బీఆర్ నాయుడు స్పందించారు. టోకెన్లు లేకుంటే తిరుమలకు రానివ్వరంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. అలాంటి ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నా. తిరుమలకు వచ్చే వారికి అనుమతి నిరాకరించే హక్కు ఎవరికీ లేదు. టోకెన్లు ఉన్న భక్తులనే దర్శనానికి అనుమతిస్తామని చెప్పాం. జనవరి 2 నుంచి టోకెన్లు లేకున్నా దర్శనానికి అనుమతిస్తాం. తిరుమలలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 8 వరకు వైకుంఠద్వార దర్శనం అని తితిదే ఛైర్మన్ వివరించారు.

## సంపాదకీయం

# పేదరిక నిర్మూలనపై దొంగ లెక్కలు !

భారతదేశంలో పేదరిక నిర్మూలన అన్నది కేవలం కాగితాలకే పరిమితం అవుతోంది. పేదలు ఉంటేనే రాజకీయ నాయకుల మనుగడ సాధ్యం అవుతుంది. పేల పేరుతో దుబారా చేయడం సులువవుతుంది. అనేక పథకాలను ప్రకటిచడం, డబ్బులను దుబారా చేయడం, ఓట్లను దండుకోవడం అన్న ప్రక్రియ నిరంతరంగా సాగాలి. అందుకే పేదల పేరుతో నిత్యం ఏదో ఓ కార్యక్రమం సాగుతూనే ఉంటుంది. ఇటీవల ఉపాధి హామీ పథకం పేరు మారింది. దీంతో అన్నిపార్టీలు గగ్గోలు పెడుతున్నాయి. మహాత్మాగాంధీ పేరు తొలగిండంపై ఆందోళనలకు దిగాయి. లెఫ్ట్ పార్టీలు కూడా ఇందులో పాలుపంచుకోవడం దారుణం. పేరులో ఏముందున్న జ్ఞానం లేకుండా గగ్గోలు పెడుతున్నారు. ఉపాధిహామీతో అసలు కూలీలకు కరువు వచ్చింది. ప్రభుత్వ ధనం వృధా అవుతోంది. వ్యవసాయ పనులు జరగడం లేదన్నది ప్రధాన ఆరోపణ. అయితే ఈ పథకం కింద గ్రామస్థాయిలో నిర్మాణాత్మక పనులేవీ ఇప్పటి వరకు జరగలేదు. కేవలం మట్టి ఎత్తిపోయడం తప్ప. దీనికోసం వేలకోట్లు తగలేశారు. ఇకపోతే కోట్లాదిమందిని పేదరికం నుంచి బయటపడేశామని, కోట్ల మందికి ఇళ్లు కట్టించామని కేంద్రం చెబుతోంది. ఇంత జరిగితే పేదరికం లేకుండా పోవాలి. అలాంటప్పుడు ఉచిత బియ్యం, ఉచిత ఇల్లు, ఉచిత కరెంట్, ఉచిత గ్యాస్ వంటి పథకాలు అసవరం లేదు. ఓ వపు పేదరిక నిర్మాలన జరిగిందని చెబుతూనే..మరోవైపు పేదల పేరుతో పథకాల దందా సాగుతోంది. ఇది పాలకుల ద్వంద్వ విధానాలకు నిదర్శనం. పేదలు ఉంటేనే ఓట్లు రాలుతాయని వారికి తెలుసు. భారత్‌లో పేదలు జనాభాలో 5.25 శాతం మాత్రమే ఉన్నారంటూ ప్రపంచబ్యాంక్ ప్రకటించింది. తలసరి రోజు ఖర్చు రూ.62గా నిర్ధారించి అంతకన్నా తక్కువ ఆదాయం వస్తున్నవారు 5.25 శాతం మాత్రమే ఉన్నారని ప్రకటించింది. ఇక నీతి ఆయోగ్ 2022-23 నాటికి దేశంలో 5 శాతం మాత్రమే నిరుపేదలు ఉన్నట్టు ప్రకటించింది. గ్రామాల్లో రూ.57, పట్టణాల్లో రూ.69 చొప్పున రోజుకు తలసరి ఆదాయం గనుక వస్తే వారంతా నిరుపేదలు కానట్టే లెక్కించింది. పేదరిక స్థాయి నిర్ధారించేటప్పుడు ఆ సొమ్ముతో రోజువారీ ఆహారపు అవసరాలతోబాటు వైద్యానికి, దుస్తులు వగైరాలకు, రవాణాకు, అద్దెకు కూడా చెల్లించగలిగేలా ఉండాలి. ఇప్పుడు నిర్ణయించిన స్థాయిలో బతకాలంటే వాళ్ళు ఇల్లూ వాకిలీ లేని బిచ్చగాళ్ళుగా మాత్రమే మిగులుతారు. ఈ లెక్కన చూస్తే మరో ఏడాది నాటికి ఇండియాలో నిరుపేదలు అనేవారే లేరంటూ ప్రభుత్వం ప్రకటించవచ్చు. పెరుగుతున్న విద్య, వైద్యపు ఖర్చులతో కోట్లాదిమంది అదనంగా పేదరికంలోకి అనునిత్యమూ దిగజారిపోతూ వుంటే, కనీస పౌష్టికాహార లోపం వారిని జీవచ్ఛవాలుగా చేస్తూ వుంటే, మరోపక్క ప్రపంచబ్యాంక్ తన తప్పుడు లెక్కలతో నిరుపేదలు తగ్గిపోయారంటూ ప్రకటిస్తూ వారిని అవహేళన చేస్తూనే వుంది. ఎందుకంటే ఇంత తక్కువ స్థాయిలో బతకలేక ఆ నిరుపేదలంతా అప్పటికి చచ్చివూరుకుంటారు. కనీస పౌష్టికాహార స్థాయిని బట్టి పేదరికపు స్థాయిని గనుక నిర్ణయిస్తే అది ప్రభుత్వం నిర్ణయించినదానికి మూడు రెట్లయినా ఉంటుంది. ఆ స్థాయికి దిగువన ఇప్పుడు 65 శాతం ప్రజలు పడిపోయారు. నజానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో ధరల దాడి వల్ల ఉన్నవారు కూడా పేదలుగా మారే ప్రమాదం ఏర్పడింది. దీనిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదు. ప్రపంచ బ్యాంక్ లెక్కలు ఎందుకు పనికిరానివిగా గుర్తించాలి. పేదరిక నిర్మూలన అంటే కూడు,గూడు, గుడ్డ ఉంటేనే చాలదు. బతకడానికి పని ఉండాలి. పనిచేసుకుంటే కుటుంబాన్ని పోషించుకోగలగాలి. ఇవేవీ లెక్కల్లోకి తీసుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితులను కల్పించేందుకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు కూడా లేవు. పేదరికం నుంచి బైట పడడానికి నిర్దిష్టమైన చర్యలను తీసుకోవడం మొదలుపెట్టాలి. దుర్భర దారిద్య్రంలో బతుకుతున్నవారిని గుర్తించి వారికి తగు విధంగా పునరావాసానికి సహాయం అందించడంలో

ముందుకు సాగాలి. కుటుంబాలను గుర్తించేందుకు గ్రామాల వారీగా లెక్కలు తీయాలిచ ప్రపంచబ్యాంక్ మాత్రం ఇటువంటిదేమీ చేయడం లేదు. నిరుపేదరికపు స్థాయిని అమెరికన్ డాలర్లలో రోజుకు 3 డాలర్లుగా నిర్ధారించింది. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడు డాలరు-రూపాయి మారకపు విలువ ప్రకారం పేదరికపు స్థాయి రూ.270గా ఉండాలి. కాని వాస్తవ మారకపు రేటు ప్రకారం కాకుండా అందులో 0.28 శాతం రేటు ప్రకారం మాత్రమే లెక్కిస్తోంది! ఇక్కడి అధికారిక పేదరిక స్థాయికి దగ్గరగా ఉండేట్టు వాస్తవ మారకపు రేటును సవరిస్తోంది! ఇలా వివిధ దేశాల్లో అధికారిక లెక్కల్లో పేదరికపు స్థాయిని హీనమైన స్థాయికి దిగజార్చు తున్నారు. ఆ స్థాయిలో ప్రాణాలను నిలబెట్టుకోవడమే అసాధ్యం అన్న వాస్తవాన్ని తెలిసి కూడా లెక్కల కోసం ఇలా చేస్తున్నారని అనుకోవాల్సిందే. చాలా దశాబ్దాలుగా ప్రభుత్వాలు పేదరికపు స్థాయిని లెక్కించే విధానాన్ని అసమగ్రంగా చేపడుతున్నాయి. ఇది ప్రపంచబ్యాంక్ ఆదేశాల మేరకే జరుగుతోందన్నది స్పష్టం. మొట్టమొదట లెక్కించిన కనీస పేదరిక స్థాయి మాత్రమే సరైన పద్ధతిలో సాగింది. తరవాత ధరల సూచీ ఆధారంగా సవరిస్తూ వచ్చారు. అలా సవరించిన తర్వాత ఆ సొమ్ముతో పౌరుడు లేదా ఓ కుటుంబం కనీస పౌష్టికాహారం పొందగలుగుతున్నారా లేదా అన్నది మాత్రం ఎక్కడా పరిశీలించిన పాపాన పోలేదు. పేరికాన్ని లెక్కించే విషయంలో దేశంలో చదువుకున్న వారికీ ఈ ప్రభుత్వం, ప్రపంబ్యాంక్ అనుసరిస్తున్న పద్ధతి ఎంత అర్ధరహితమో తెలియదు గనుకనే ప్రభుత్వపు ఆటలు సాగుతున్నాయి.ఇలా ప్రతీసారీ అధికారిక లెక్కలు పేదరిక స్థాయిని అంతకంతకూ తగ్గిస్తూనే వస్తున్నాయి. అది కాస్తా ఇప్పుడు అసందర్భమైన, అర్థం లేని స్థాయికి చేరింది. ప్రభుత్వం నిర్ణయించిన పేదరిక స్థాయి కనీసం ప్రాణాలనైనా నిలబెట్టుకోడానికి కూడా పనికిరాదు. అందుచేత మా దేశంలో నిరుపేదలే లేరు అని చెప్పుకోవడం దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు. నిజానికి కాలానుగుణంగా కనీస అవసరాలు మారుతూ వుంటాయి. ఆ మార్పును పరిగణనలోకి తీసుకోవాలి. కాని అలా తీసుకోకపోయినప్పటికీ, పాత స్థాయిలోనే అవసరాలు కొనసాగుతున్నాయని అనుకున్నప్పటికీ, వాటిలో వచ్చిన మార్పులనైనా పరిగణనలోకి తీసుకోవాలి. 50 సంవత్సరాల క్రితం విద్య, వైద్యం ప్రభుత్వ వ్యవస్థ ద్వారా అందుతూవుండేవి. అప్పుడు వాటి కోసం చేయవలసిన ఖర్చు నామ మాత్రంగా ఉండేది. ఇప్పుడు ఆ సేవలు ప్రైవేటుపరం అయ్యాయి. వాటి ధరలు శరవేగంగా పెరిగిపోతూ వున్నాయి. ఇటు వైద్యానికి, చదువుకు, అటు ఆహారానికి ఖర్చు సర్దుబాటు చేయడం చాలా కుటుంబాలకు అసాధ్యం అయిపోతోంది. దీని వలన ఎక్కువమంది పేదల పౌష్టికాహార స్థాయి పడిపోతోంది. అంతేగాక, ఇంతవరకూ పేదలుగా పరిగణించబడనివారు కూడా ఇప్పుడు పేదరిక స్థాయికి దిగువకు జారిపోతున్నారు. జాతీయ శాంపిల్ సర్వే గణాంకాల ప్రకారం ఇండియాలో గ్రామాల్లోను, పట్టణాల్లోను తలసరి పౌష్టికాహార లభ్యత చాలా వేగంగా పడిపోయింది. ఇది గమనించకుండా పేదరికం నుంచి విముక్తి పొందారని, పేదరికం తగ్గిందని లెక్కలు వేసుకోవడం ఆత్మహత్యా సదృశ్యం కాగలదు.

పృద్విరాజ్.జి
ఎడిటర్

# కెసిఆర్ ధోరణి మార్చుకో

తోలు వలుస్తామంటే ఎవ్వరూ భయపడరు ● అలాంటి వారికి ప్రజలే బుద్ది చెబుతారు ● ఘాటుగా స్పందించిన డిప్యూటి సిఎం భట్టి



ఖమ్మం,డిసెంబర్23(అక్షరవెలుగు): తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. శాసనసభకు వచ్చే ధైర్యం లేని వారు, బయట ఉండి అడ్డగోలుగా మాట్లాడటం తగదని ఆయన హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వంపై భారత రాష్ట్ర సమితి నేతలు విషం కక్కుతున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయట్లేదని వివరించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ఏడా రూ.12,500 కోట్లు విద్యుత్‌శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు. తోలు తీస్తామని బీఆర్ఎస్ నేతల మాదిరిగా దిగజారి మాట్లాడలేమన్నారు. అలాంటి వ్యాఖ్యలు చేసిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. రెండేళ్లుగా అసెంబ్లీకి రాని కేసీఆర్.. మీడియా సమావేశంలో ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. శాసనసభకు రావడానికి కేసీఆర్ భయపడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గొప్ప తీర్పు అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలోని 85 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ భారీ ఆధిక్యతతో ఉంది. గతంలో ఏ రాజకీయ పార్టీని కూడా ప్రజలు ఇంత పెద్ద ఎత్తున దీవించలేదు. ఇందిరమ్మ రాజ్యం ప్రజల పక్షాన నిలబడటం వల్లే ప్రజలు స్వచ్ఛందంగా మాకు మద్దతు ఇస్తున్నారు అని ఆయన వివరించారు. ముఖ్యంగా 65 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిన 'తోలు వలుస్తాం' అనే వ్యాఖ్యలను భట్టి తీవ్రంగా ఖండించారు. తోలు తీసుకునే ఉద్యోగం నువ్వు ఎప్పుడు తీసుకున్నావు కేసీఆర్? పదిమందిని కూర్చోబెట్టుకొని తోలు వలుస్తానంటే ఇక్కడ ఎవరూ భయపడే వారు లేరు. నువ్వు అడ్డగోలుగా మాట్లాడినా, మేము మాత్రం దిగజారి ప్రవర్తించము. మా అభివృద్ధి చాటల ద్వారానే మీకు సమాధానం చెబుతాం' అని భట్టి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభకు వచ్చి ప్రజల సమస్యలపై మాట్లాడాల్సిన బాధ్యతను కేసీఆర్ విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. సభకు వచ్చే ధైర్యం లేకనే బయట ఉండి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. గతంలో జరిగిన ఎన్నికలకు, ఇప్పుడు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలకు చాలా తేడా ఉందని భట్టి విక్రమార్క అన్నారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా, పూర్తి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించామని, అందుకు ప్రజలు ఓటు ద్వారా కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన మద్దతు ఇచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలను ప్రజలు ఇచ్చారని, ఇప్పటికైనా కేసీఆర్ తన ధోరణి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి, విమర్శలకే పరిమితం కావడం ప్రతిపక్షాలకు తగదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు

# ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

## వరదలు,పారిశ్రామిక ప్రమాదాల నివారణపై దృష్టి
## సమన్వయంతో ముందుకు సాగిని వివిధ శాఖలు

హైదరాబాద్,డిసెంబర్23(అక్షరవెలుగు):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సహకారంతో, వరదలు,పారిశ్రామిక ప్రమాదాల ప్రతిస్పందన అంశాలపై 22 డిసెంబర్ న తొలిసారిగా రాష్ట్ర స్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించింది. ఇటీవలి సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రంలో అనూహ్యమైన ,వివరణలేని వాతావరణ మార్పులు చోటుచేసుకుంటూ, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అకస్మాత్తుగా భారీ వర్షాలు ,ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. అదేవిధంగా, ఇటీవల కాలంలో రాష్ట్రం కొన్ని ప్రధాన పారిశ్రామిక ప్రమాదాలకు కూడా సాక్ష్యంగా నిలిచింది. వరదలకు గురయ్యే ప్రాంతాల ఆధారంగా ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌ను 12 జిల్లాల్లో ఖమ్మం, వరంగల్, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి మరియు హనుమకొండలో నిర్వహించారు. ప్రధాన పారిశ్రామిక ప్రాంతాల ఆధారంగా ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌ను 5 జిల్లాల్లో సంగారెడ్డి, మెద్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్గొండ అలాగే హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్వహించారు. మాక్ ఎక్సర్‌సైజ్‌ల ప్రధాన లక్ష్యాలు రాష్ట్రం, జిల్లాలు మరియు వివిధ శాఖల సన్నద్ధతను పరీక్షించి మరింత బలోపేతం చేయడం, ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్స్‌ను కార్యరూపంలోకి తేవడం, శాఖల మధ్య సమన్వయం మరియు అత్యవసర మద్దతు విధుల ప్రభావాన్ని అంచనా వేయడం, అలాగే జిల్లా కలెక్టర్లు మరియు ఇతర ఏజెన్సీల పాత్రలపై స్పష్టత కల్పించడం జరిగింది. మాక్ ఎక్సర్‌సైజ్‌లు వరద ప్రమాద హెచ్చరిక సంకేతాలు అత్యవసర విధానాలపై మెరుగైన అవగాహనను కల్పించాయి. ముందస్తు హెచ్చరిక,సమాచార వ్యవస్థల ప్రభావాన్ని పరీక్షించి లోపాలను గుర్తించారు. శాఖలు,స్పందన బృందాల పాత్రలు, బాధ్యతలు మరింత స్పష్టంగా అవగాహనకు వచ్చి సమన్వయం మెరుగుపడింది. సకాలంలో ప్రజలను తరలించడం, సురక్షిత తరలింపు మార్గాలు మరియు ఆశ్రయాలను గుర్తించడం ఎంత ముఖ్యమో ఈ వ్యాయామాలు హైలైట్ చేశాయి. అత్యవసర స్పందన బృందాలు, పరికరాలు, రక్షణ వనరుల సన్నద్ధతను అంచనా వేశారు. శాఖల మధ్య మెరుగైన సమన్వయం అవసరమని, వరదల సమయంలో ప్రజల అవగాహన మరియు సహకారం ఎంత ముఖ్యమో స్పష్టం అయింది. మానవ వనరులు, పరికరాలు మరియు లాజిస్టిక్స్‌లో ఉన్న లోపాలను గుర్తించి, మెరుగుదల ప్రణాళికలకు దోహదపడింది. సన్నద్ధత కొనసాగించడానికి క్రమం తప్పని శిక్షణలు మరియు మాక్ డ్రిల్లుల అవసరాన్ని పునరుద్ఘాటించింది. వాస్తవ వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు స్పందన బృందాలు మరియు సంబంధిత వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పారిశ్రామిక ప్రమాదాల మాక్ ఎక్సర్‌సైజ్‌ల నుంచి కూడా అనేక పాఠాలు నేర్చుకున్నారు. ముఖ్యంగా అగ్నిప్రమాదాలు మరియు రసాయన ఘటనల సమయంలో సమీప పరిశ్రమల మధ్య పరస్పర సహాయం అవసరం, మానవ వనరులు, పరికరాలు మరియు నైపుణ్యాలను పంచుకోవడం ద్వారా స్పందన సమయాన్ని, నష్టాలను తగ్గించవచ్చని గుర్తించారు. అగ్నిమాపక శాఖ, పోలీస్ మరియు వైద్య సేవల వంటి బాహ్య ఏజెన్సీలతో మెరుగైన సమన్వయం అవసరమని హైలైట్ చేశారు. శిక్షణ, మానవ వనరులు మరియు అత్యవసర వనరుల్లో ఉన్న లోపాలను గుర్తించారు. మాక్ ఎక్సర్‌సైజ్‌లు తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర మరియు పౌర రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మన్ పర్యవేక్షణలో, లీడ్ కన్‌స్టలెంట్ మేజర్ జనరల్ సుధీర్ బహల్ మార్గదర్శకత్వంలో, వివిధ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లు, అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు, వాలంటీర్లు ,ఇతర ఏజెన్సీలు పాల్గొన్నాయి.

# 5 జిల్లాలలో ప్రయోగాత్మకంగా యూరియా యాప్

## యాప్ పనితీరు పట్ల రైతులు సంతృప్తి
## రెండురోజుల్లో యాప్ ద్వారా 60,510 బస్తాలు కొనుగోలు
## త్వరలో అన్ని జిల్లాలలో అమలుకు సన్నాహాలు



హైదరాబాద్,డిసెంబర్23(అక్షరవెలుగు):వ్యవసాయశాఖ ద్వారా ప్రవేశపెట్టిన యూరియా యాప్ 5 జిల్లాలలో ప్రయోగాత్మకంగా గత రెండ్రోజుల నుండి పరిశీలించడం జరిగిందని, 5 జిల్లాలలో దాదాపు లక్ష మందికి పైగా డౌన్ లోడ్ చేసుకోవడం జరిగిందని మంత్రి తుమ్మలనాగేశ్వర రావు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 897, జనగామ జిల్లాలో 5150, మహబూబ్ నగర్ 3741, నల్లగొండ 3618 మరియు పెద్దపల్లి జిల్లాలోని 6289 మొత్తం 19695 మంది రైతులు ఈ యాప్ ద్వారా యూరియాను తమ సమీప డీలర్ దగ్గర 60,510 యూరియా బస్తాలు బుక్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా 217 మంది కౌలు రైతులు కూడా 678 యూరియా బస్తాలు ఈ యాప్ ద్వారా బుక్ చేసుకోవడం జరిగిందని, మొదటి రోజు అక్కడక్కడ తలెత్తిన సాంకేతిక సమస్యలను కూడా వెంటనే పరిష్కరించడం జరిగిందని తెలిపారు. రైతులు కూడా ఈ యాప్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని, వారికి వారి ఊరిలో ఏ డీలర్ దగ్గర ఎంత స్టాక్ ఉందో తెలుస్తుందని, తద్వారా వారు బుక్ చేసుకొని, వారికి నచ్చిన సమయంలో షాప్ వద్దకు వెళ్లి ఓటిపి చూపించి కొనుగోలు చేసారని తెలిపారు. ఈ రెండు రోజుల్లో యాప్ విజయవంతం కావడంతో, ఈ యాప్ ను మరికొన్ని రోజులు పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా అమలు

# కెసిఆర్ రాకతో సర్కార్‌లో వణుకు

(మొదటి పేజీ తరువాయి) రేవంత్ సర్కార్ డిఫెన్స్ లో పడిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తాను 25 ఏళ్ళుగా రాజకీయాల్లో ఉన్నానని, రాత్రి 9.30 గంటలకు ముఖ్యమంత్రి చిట్‌చాట్ పెట్టడం చూడలేదని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. అందాల పోటీలు, ఫుట్‌బాల్ షోకులు, గ్లోబల్ సమ్మిట్‌లు అన్నం పెడతాయా..? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌కు వాస్తు భయం పట్టుకుందని, అందుకే సచివాలయానికి పోవటం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాలుగు వేల మంది సర్పంచ్‌లుగా గెలిచారని, బీఆర్ఎస్ దెబ్బకు డీసీసీబీలకు ఎన్నికలు పెట్టడం లేదని, కాంగ్రెస్ కార్యకర్తలను నామినేట్ చేయాలని చూస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి పోలీసులు లేకుండా ఓయూకు వస్తానని చెప్పారని, కానీ పోలీస్ పహారా మధ్య వచ్చారని అన్నారు. ఇరిగేషన్‌పై పీపీటీని స్వాగతిస్తున్నా మని, పీపీటీపై అసెంబ్లీలో తమకూ సరిపడా అవకాశం ఇవ్వాలని కోరారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కడం, మైక్ కట్ చేయడం లాంటివి చేయవద్దని అన్నారు. ఎవరి వాదన నిజమో ప్రజలు తేలుస్తారని చెప్పారు. సీపీఐ, ఎంఐఎం, బీజేపీ కంటే తక్కువ సమయం బీఆర్ఎస్‌కు ఇస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ప్రభుత్వం భయపడుతుందని, అవకాశం ఇస్తే అసెంబ్లీలో కాంగ్రెస్ సర్కార్ బట్టలు విప్పుతామని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం దాచిపెట్టిన అన్ని జీవోలను నాలుగు వారాలలోపు బహిర్గతం చేయాలని, పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు సోకాల్డ్ ప్రజా ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. రేవంత్‌రెడ్డి తనది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడం కాదని, చీకటి జీవోల మాటున దొంగచాటుగా ఏం చేస్తున్నాడో బహిర్గతం చెయాలని ఆయన ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ప్రజాపాలన అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ జీవోలు దాస్తూ డ్రామాలు చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. ఆర్టీఐ సమాధానం ఆధారంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ హైకోర్టులో వేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ తో ఆ డ్రామాలు బయటపడబోతున్నాయని అన్నారు. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 జనవరి 1 వరకు అంటే మొత్తం 13 నెలల్లో ప్రభుత్వం 19,064 జీవోలు జారీ చేసిందని, వాటిలో కేవలం 3,290 జీవోలు మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో ఉంచడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క ఏడాదిలో 15,774 జీవోలు అంటే 82 శాతం జీవోలను దాచిపెట్టి ప్రభుత్వం ఏం చేస్తున్నట్లని హరీశ్‌రావు నిలదీశారు. 'రేవంత్ రెడ్డీ ఇదేనా మీరు చెప్పుకుంటున్న ప్రజా ప్రభుత్వం అని ప్రశ్నించారు.

# 2026 సంవత్సర క్యాలెండర్, డైరీ

(మొదటి పేజీ తరువాయి) ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో 2026 క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్, డైరీలను సీఎం ఆవిష్కరించారు. జీవ వైవిధ్యం - ఆంధ్రప్రదేశ్ సజీవ వారసత్వం అనే థీమ్‌తో క్యాలెండర్‌ను అసెంబ్లీ సెక్రటేరియట్ రూపొందించింది. ఏపీలోని ప్రకృతి సంపద, కళలు, సంప్రదాయాలు, ఆధునిక సాంకేతికతలకు అద్దం పట్టేలా కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను రూపొందించారు. ఏపీలో ఉన్న వివిధ వన్యప్రాణుల గురించి అవగాహన కల్పించేలా నూతన సంవత్సర క్యాలెండర్ రూపకల్పన జరిగింది. సాంప్రదాయ కలంకారీ కళాశైలిలో క్యాలెండర్లోని చిత్రాలు వచ్చేలా శాసన సచివాలయం డిజైన్ చేయించింది. ఆంధప్రదేశ్ జీవ వైవిధ్య వారసత్వాన్ని, సీఎం ఆలోచనలను చాటిచెప్పేలా 2026 క్యాలెండర్ ఆవిష్కృతమైంది.2026 సంవత్సరానికి చెందిన క్యాలెండర్‌ను చక్కగా డిజైన్ చేశారని సీఎం చంద్రబాబు మెచ్చుకున్నారు. ప్రకృతిని కాపాడుకోవాలనే మంచి సందేశంతో క్యాలెండర్ ఉందని ప్రశంసించారు. క్యాలెండర్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రికి స్పీకర్ అయ్యన్న పాత్రుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక, శాసన సభా వ్యవహారాల శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

# యూరియా కోసం యాప్ ద్వారా బుకింగ్

(మొదటి పేజీ తరువాయి)కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారులకు కలెక్టర్ సూచించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతులందరూ ఈ యాప్‌ను వినియోగించాలని, ఎలాంటి సందేహాలున్నా సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎరువుల కోసం గంటల తరబడి లైన్లలో నిలబడకుండా.. సులభంగా, పారదర్శకంగా అవసరమైన ఎరువులు అందేలా ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ తీసుకొచ్చింది. రైతులు ఇంటి దగ్గరే ఉండే ఆయా సీజన్లకు అవసరమైన ఎరువులను యాప్‌లో బుకింగ్ చేసుకొని సులభంగా పొందవచ్చు. జిల్లాలో ఇది అమల్లోకి రావడంతో ఎలా బుకింగ్ చేయాలి అన్న అంశాలపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం వ్యవసాయ అధికారులు గ్రామాల్లో సమావేశాలు పెట్టి అవగాహన రైతులకు కల్పిస్తున్నారు. రైతు వేదికలు, పంచాయతీ భవనాలు, సొసైటీలు, గ్రామ కూడళ్లలో సమావేశాలు పెట్టి .. యాప్ గురించి సులభంగా అర్థమయ్యేలా వివరిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా వరి, మక్క, సోయా, పత్తి, చెరకు, కంది,పెసర, మినప పంటలు సాగు చేస్తుంటారు. ఈ పంటల సాగుకు విరివిగా ఎరువులు అవసరమవుతాయి. ప్రధానంగా యూరియా వినియోగంఎక్కువ. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో సొసైటీలు, డీలర్ల వద్ద రైతులు ఎరువుల కోసం క్యూ కట్టవలసివస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు గంటల తరబడి లైన్లలో నిల్చోవలసివచ్చింది. కొన్ని చోట్ల లైన్లలో చెప్పులు, రాళ్లు పెట్టి ఎదురుచూసినా కొందరికి యూరియా దొరకలేదన్న ప్రచారం జరిగింది. రైతులు ఒక్కసారిగా సొసైటీలు, షాపుల ద్గరకు రావడం, కొరత రానుందన్న ప్రచారంతో అవసరానికి మించి యూరియి బస్తాలు కొని దాచుకోవాలని ఆశించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. దీంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఎరువుల బుకింగ్ యాప్ తీసుకొచ్చింది. దీని వల్ల రైతులకు అవసరాలకు తగినంత యూరియా అందనుంది. యూరియా పక్కదారి పట్టే అవకాశం కూడా ఉండదు. రైతులు తమ పట్టాదారు పాసుబుక్ నంబర్, భూమి వివరాలు, పంటల సాగు వివరాలు ఎంట్రీ చేసుకోవాలి. ఆ తర్వాత తమకు అవసరమైన యూరియా బుకింగ్ చేసుకొవచ్చు. భూ విస్తీర్ణం బట్టి రైతులకు యూరియా కేటాయింపు ఉంటుంది. బుక్ చేసుకున్న 24 గంటల్లోగా రైతులు ఎరువులను తీసుకోవాలి. గ్రామాల్లో వారం రోజుల పాటు అవేర్ నెస్ ప్రోగ్రాంలు నిర్వహించనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

అక్షర వెలుగు
తెలుగు దిన పత్రిక

# శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

## వైకుంఠ ఏకాదశికి పకడ్బందీగా ఏర్పాట్లు

దర్శనాల్లో సామాన్య భక్తులకే పెద్ద పీట

తొలి మూడు రోజులు టోకెన్ ఉన్న భక్తులకే దర్శనం

చివరి ఏడు రోజుల్లో సర్వ దర్శనం

టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్



తిరుమల,డిసెంబర్23(అక్షరవెలుగు): తిరుమల శ్రీవారి ఆలయంలో 30 తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను పవిత్రమైన పరిమళ జలాన్ని ప్రోక్షణ చేసి, నీటితో శుభ్రం చేశారు. ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ, సాధారణంగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి టీటీడీ చేసిన ఏర్పాట్ల గురించి ఈవో మాట్లాడుతూ డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేదీ నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాల కోసం పగడ్బంది ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రెండు నెలలుగా అధికార యంత్రాంగం తనిఖీలు నిర్వహించి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, అన్న ప్రసాదాలు, వసతి, క్యూ లైన్ల నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాలపై ప్రణాళికలు సిద్ధం చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం మేరకు వైకుంఠ ఏకాదశిపై ప్రత్యేక బోర్డు సమావేశం నిర్వహించి సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. డిసెంబర్ 30న వైకుంఠ ఏకాదశి, 31న వైకుంఠ ద్వాదశి, జనవరి 1వ తేదీలకు సామాన్య భక్తులకు ఈ-డిప్ విధానం ద్వారా దర్శన టోకెన్లు కేటాయించామన్నారు. భక్తులందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఐదు రోజుల పాటు ఈ-డిప్ రిజిస్ట్రేషన్ కు అవకాశం కల్పించామన్నారు. దాదాపు 24 లక్షల మంది భక్తులు ఈ-డిప్ కు రిజిస్ట్రేన్ చేసుకోగా మొదటి మూడు రోజులకు 1.89 లక్షల భక్తులను ఈ-డిన్ ద్వారా ఎంపిక చేసి టోకెన్లు కేటాయించామని తెలిపారు. ఈ మూడు రోజులకు టోకెన్లు పొందిన భక్తులకు నిర్దేశిత తేది, సమయాన్ని కేటాయించడం జరిగిందని, ఆ సమయం ప్రకారమే భక్తులు దర్శనానికి వస్తే ఎలాంటి ఇబ్బంది కలగకుండా రెండు గంటల్లోనే దర్శనభాగ్యం కలుగుతుందని అన్నారు. ఈ-డిప్ ద్వారా టోకెన్ పొందలేని భక్తులు జనవరి 2 నుండి 8వ తేది వరకు సర్వ దర్శనం క్యూ లైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. మొదటి మూడు రోజులు మాత్రమే ఈ-డిప్ విధానంలో టోకెన్లు కేటాయించామని, చివరి ఏడు రోజులు భక్తులు నేరుగా తిరుమలకు వచ్చి సర్వ దర్శనం క్యూలైన్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అదేవిధంగా జనవరి 2 నుండి 8వ తేది వరకు రోజుకు 15 వేల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను, 1500 శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్ లైన్ లో విడుదల చేశామని చెప్పారు. తిరుపతి, తిరుమల స్థానికులకు స్థానికుల కోటా కింద జనవరి 6,7,8 తేదీల్లో రోజుకు 5వేల టోకెన్లు జారీ చేయనున్నట్లు తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే కారణంగా చంటి పిల్లల తల్లిదండ్రులు, వృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ, డిఫెన్స్ వంటి ప్రత్యేక దర్శనాలను రద్దు చేశామని చెప్పారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్న ప్రసాదాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. భద్రతకు సంబంధించి 3500 మంది పోలీసులు, 1150 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుని భక్తులు వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామన్నారు. భక్తులందరూ టీటీడీ సూచనలు పాటిస్తూ సంయమనంతో స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులవ్వాలని ఈవో తెలియజేశారు.

# 104 ఎం ఎం యు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నెల్లూరు, డిసెంబర్ 23(అక్షర వెలుగు)

104 ఎం ఎం యు ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ యూనియన్ నాయకులు మంగళవారం నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిఆర్ఓ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరబిందో సంస్థ చెల్లించిన చివరి నెల వేతనాలను ప్రతి ఉద్యోగికి కొనసాగించాలన్నారు. ఇప్పటివరకు తగ్గించిన వేతనాలను బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. 104 ఉద్యోగులపై భవ్య యాజమాన్యం వేధింపులు, సోకాజ్ నోటీసులు,సస్పెండ్ చర్యలు ఎత్తివేయాలన్నారు. రద్దు చేసిన 15 క్యాజువల్ లీవ్లను వెంటనే పునరుద్ధరించాలని తెలిపారు. ఐదేళ్ల కాల పరిమితి పూర్తి చేసుకున్న 104 వాహన డ్రైవర్లకు నూతన స్లాబ్ ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తులు చేసిన జీవో నెంబర్ 7 ప్రకారం డేటా ఎంట్రీ ఆపరేటర్లకు18500 రూపాయల వేతనం చెల్లించాలన్నారు. తొలగించిన బఫర్ సిబ్బందిని పునరుద్ధరించడంతోపాటు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం మేరకు వెంటనే అదనపు సిబ్బందిని నియమించాలని అన్నారు. స్థానికత ఆధారంగా ఉద్యోగులకు బదిలీల అవకాశం కల్పించాలన్నారు. వాహనాలకు ప్రతినెలా సర్వీస్ నిర్వహించి, పూర్తి కండిషన్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తగ్గించిన పిఎఫ్ వాటాలను పునరుద్దించాలని కోరారు. అలాగే పేస్లిప్,నియామక పత్రాలు అందించాలన్నారు.





గత అరబిందో సంస్థ 104 ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాడ్యుటీ, ఎర్న్ లీవులు,ఏప్రిల్ నెల వేతనంలో కోత విధించిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 104 ఉద్యోగులకు 10 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఫిజికల్ రికార్డుల పేరుతో 104 ఉద్యోగులపై పెడుతున్న పని భారాన్ని తగ్గించాలని కోరారు. 104 ఉద్యోగుల సమస్యలపై ప్రతి నెల సంఘం నాయకులతో జిల్లా కలెక్టర్ సమక్షంలో గ్రీవెన్స్ నిర్వహించాలని అన్నారు. 104 వాహనాల నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని అన్నారు. 104 ఎం ఎం యు లొకేషన్, వాహనాలలో స్టేషనరీ కోసం 5000 రూపాయల అడ్వాన్సు ఏర్పాటు చేయాలన్నారు. ఓకే డ్రైవర్ తో రెండు 104 వాహనాలను నడిపించే పద్ధతిని నిరోధించి, అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. ప్రభుత్వ ఒప్పందం మేరకు ప్రజా సౌకర్యార్థం అన్ని రకాల మందులు అందుబాటు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 ఎం ఎం యు యూనియన్ నెల్లూరు జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్.సతీష్ కుమార్,అధ్యక్షులు వి.రమేష్,ప్రధాన కార్యదర్శి ఎల్. సత్య ప్రకాష్,వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. వాసు,పెంచలయ్య,బి జయరామ్, షేక్. యస్దాని, ఉపాధ్యక్షులు వెంకటరమణయ్య, జాయింట్ సెక్రటరీలు పి.నాగరాజు,అరవింద్, ఉప వర్కింగ్ ప్రెసిడెంట్ హరికృష్ణ కుమార్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది పక్కా మాఫియా పాలన

(మొదటి పేజీ తరువాయి)మెషీన్లతో హోల్స్ చేసి, జెలటిన్ స్టిక్స్ పెట్టి పేల్చారని ఆయన సాక్ష్యాలతో సహా నిరూపించారని అన్నారు. ఇసుకను దోచుకోవడానికి అడ్డుగా ఉన్నాయని, కోట్ల రూపాయల ప్రజా ధనంతో కట్టిన చెక్ డ్యామ్‌లను డైనమైట్లు పెట్టి పేల్చేస్తారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వమా లేక గ్యాంగ్ స్టర్ల అడ్డాయా అని నిలదీశారు. భూగర్భ జలాలు పెరగాలని మేం చెక్ డ్యామ్‌లు కడితే.. వాటిని కూల్చివేసి రైతుల పొలాలను ఎడారిగా మారుస్తున్నారని మండిపడ్డారు. మీ ఇసుక కాంట్రాక్టర్ల లాభాల కోసం తెలంగాణ రైతాంగం బలి కావాలా అని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల కూలిపోయాయని కట్టుకథలు అల్లిన కాంగ్రెస్ మంత్రులకు రాజేంద్ర సింగ్ రిపోర్ట్ చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు మీ సమాధానం ఏంటి రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. అభివృద్ధి చేయడం చేతకాదు కానీ, ఉన్న ఆస్తులను కూల్చడంలో మీరు సిద్ధహస్తులని విమర్శించారు. తెలంగాణ ఆస్తులపై బాంబులు వేస్తున్న మాఫియా వెనుక ఉన్న అసలు దొంగలను బయటపెట్టండని డిమాండ్ చేశారు. రాజేంద్ర సింగ్ డిమాండ్ చేసినట్లు పీపుల్స్ ఎంక్వైరీ కమిషన్ వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే ఈ బాంబుల సెగ మీ కుర్చీ దాకా రావడం ఖాయమని హెచ్చరించారు.

# స్వామిత్వ సర్వే పై సమీక్ష సమావేశం

బొల్లినేని ప్రభాకర్ టీడీపి గ్రామ అధ్యక్షులు




అనంతసాగరం డిసెంబర్ 23(అక్షర వెలుగు)

నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం కచ్చేరి దేవరాయ పల్లి పంచాయతీ ఆఫీస్ దగ్గర మంగళవారం ఓఎస్ఆర్ స్వమిత్వ పథకం పై కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో రామ చంద్రయ్య మాట్లాడుతూ, ప్రస్తుతం అన్ని గ్రామ పంచాయతీలలో స్వామిత్వ సర్వే కొనసాగుతున్నందున, సర్వే ఆధారంగా గ్రామాలలో ఉన్న ప్రజల ఇళ్లు మరియు ఖాళీ స్థలాలకు సంబంధించి ఆస్తి యాజమాన్య హక్కులు కల్పించబడుతున్నాయని తెలిపారు. ఈ ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రజలకు పూర్తిస్థాయిలో సహకరించడంతో పాటు, గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరుల పెంపుదలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి అని సూచించారు. అంతేకాకుండా, స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా ఇంటి పన్ను వసూలును క్రమబద్ధీకరించి నూరు శాతం వసూలు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల ఆర్థిక స్వావలంబన కోసం సొంత ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కచ్చేరి దేవరాయ పల్లి గ్రామ అధ్యక్షులు బొల్లినేని ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి జయచంద్ర మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామాలలో విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం

– విద్యుత్ ఏ.ఈ మానేటి




శ్రీహరిసీతారామపురం డిసెంబర్ 23(అక్షర వెలుగు)

సీతారామపురం మండలం చిన్ననాగాంపల్లి గ్రామంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు కరెంటోల్ల జనబాట కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈ మానేటి శ్రీహరి సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటిస్తూ విద్యుత్ సరఫరా, మీటర్ రీడింగ్, బిల్లింగ్ తదితర అంశాలపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు సూచనలు ఇచ్చిన ఏఈ మానేటి శ్రీహరి, వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే విద్యుత్ శాఖకు తెలియజేయాలని కోరారు. ఈ జనబాట కార్యక్రమంతో గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# బసినేనిపల్లి వద్ద రోడ్డు ప్రమాదం



సీతారామపురం, డిసెంబర్ 23(అక్షర వెలుగు)

సీతారామపురం మండలం పరిధిలోని బసినేనిపల్లి డాబా సమీపంలో బైక్ యాక్సిడెంట్ మంగళవారం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళ్తే ప్రసన్న కుమార్ వయసు 39 , మర్రిపాడు మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మర్రిపాడు మండలంలోని రాజుపాలెం గ్రామం నుండి అత్తగారి గ్రామమైన దేవమ్మ చెరువుకి వస్తుండగా బసినేనిపల్లి డాబా దగ్గర ఆకస్మాత్తుగా బర్రెలు అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు ఒకరికి గాయాలు కాగా వెంటనే గ్రామస్తులు 108 కి సమాచారం అందించగా త్వరగతిన 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వెంటనే గాయపడిన వారిని ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# జిల్లా అధ్యక్ష పదవి పై కాకర్ల సురేష్ హర్షం




ఉదయగిరి, డిసెంబర్ 23(అక్షర వెలుగు)

ఎమ్మెల్సీ టిడిపి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన బీద రవిచంద్ర యాదవ్ కు ఉదయగిరి నియోజకవర్గం శాసనసభ్యులు కాకర్ల సురేష్ నెల్లూరులోని బీదర్ రవిచంద్ర యాదవ్ నివాసంలో మర్యాదపూర్వకంగా మంగళవారం కాకర్ల సురేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీద రవిచంద్ర యాదవ్ నెల్లూరు జిల్లా అధ్యక్ష పదవిపై కాకర్ల సురేష్ హర్షం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే కాకర్ల అత్తల వాగు చెరువు పై సమీక్ష

పాల్గొన్న ఇరిగేషన్ డి.ఈ, ఏ.ఈ, తెలుగుదేశం పార్టీ నాయకులు



ఉదయగిరి,డిసెంబర్ 23(అక్షర వెలుగు)

వరికుంటపాడు మండలంలోని తూర్పు రొంపి దొడ్ల గ్రామంలో ఉన్నటువంటి అత్తల వాగు చెరువు ఎన్నో ఏళ్ల నాటికల కలగానే మిగిలిన నేపథ్యంలో ప్రస్తుతం స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కూండ్ల నరసింహారావు, యువ నాయకులు మారినేని రామకృష్ణ కలిసి శాసనసభ్యులు కాకర్ల సురేష్ దృష్టికి గత వారంలో తీసుకొని వెళ్ళగా దానిపై శాసనసభ్యులు మంగళవారం నాడు అధికారులతో ప్రత్యక్షంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో అత్తల వాగు యొక్క సామర్థ్యం గత అధికారులు గత ప్రభుత్వాలలో ప్రతిపాదనలను ఇరిగేషన్ డిఈ రమణారావు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కు వివరించారు. అలాగే అత్తల వాగు నిర్మాణం ఏర్పాటు చేయడం ద్వారా ప్రత్యక్షంగా 200 ఎకరాలు పారుదలకు ఉపయోగపడుతుందని పరోక్షంగా మరో 800 ఎకరాలు ఉపయోగపడుతుందని తెలిపారు. అంతేకాకుండా స్థానిక నాయకులు నరసింహారావు,యువనేత రామకృష్ణ చెరువు ఏర్పాటు చేయటం ద్వారా వ్యవసాయపరంగాను అలాగే ప్రస్తుతం గ్రామంలో ప్రభుత్వ భూమి ఉన్న నేపథ్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేసినట్లయితే అవసరమైనటువంటి నీరు అత్తల వాగు చెరువు ద్వారా పరిశ్రమలకు కూడా నీటిని సమకూర్చుకోవచ్చని తద్వారా గ్రామంలో పరిశ్రమలు ఏర్పాటుకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. అలాగే పాడి రైతులకు,జీవాల పెంపకదారులకు ,తాగు, సాగు నీటికి పరిసర గ్రామాలకు తాగునీటికి ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. అలాగే మండల నాయకులు గొడుగులూరి మాలకొండ రాయుడు,సంధి రెడ్డి నాగేశ్వరరావు ఇరువురు అత్తల వాగు చెరువు యొక్క ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఈ విషయంపై స్థానిక శాసనసభ్యులు అధికారులను అత్తల వాగు చెరువు ఏర్పాటుకు అవసరమైనటువంటి కార్యాచరణ ప్రారంభించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామాల అభివృద్ధికి ప్రజల జీవన ప్రమాణాలు అభివృద్ధికి ఉపయోగపడే ఇటువంటి చెరువులను కార్యాచరణ చేయవలసిన అవసరం ఉందని అందుకు తన వంతు కృషి కచ్చితంగా అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఇరిగేషన్ ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మూడోసారి ముచ్చటగా టీడీపీ జిల్లా అధ్యక్షునిగా బీద రవిచంద్ర నియామకం

నెల్లూరు జిల్లా టీడీపీ నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన పిడుగు రమేష్




సీతారామపురం, డిసెంబర్ 23(అక్షర వెలుగు)నెల్లూరు జిల్లా పార్లమెంట్ టిడిపి అధ్యక్షులుగా శాసనమండలి సభ్యులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బిసి నాయకులు బీద రవిచంద్ర యాదవ్ ని నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులుగా ముచ్చటగా మూడోసారి నియమించినందుకు టిడిపి సీతారామపురం మండల గ్రామ కన్వీనర్ పిడుగు రమేష్ హర్షం వ్యక్తం చేశారు .బీద రవిచంద్ర టిడిపిలో అనేక సేవలు చేసిన రవిచంద్ర కి టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులుగా నియమించినందుకు టిడిపి జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు. గతంలో రెండుసార్లు చేసి మూడోసారిగా జిల్లా అధ్యక్షుడు మూడోసారి ముచ్చటగా అవి చేపట్టడం హర్షణీయమని తెలిపారు. గత శాసనసభ జరిగిన ఎన్నికల్లో కడప జిల్లాలో వంటి చేతితో సమర్థవంతంగా తెలుగుదేశం పార్టీని గెలిపించిన సత్తా ఉన్న నాయకుడు బీద రవిచంద్ర ను గుర్తించి పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# నేడు బాలాయపల్లిలో విపిఆర్ నేత్రను... ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోండి

టీడీపీ యువ నాయకుడు ఎడమ ప్రవీణ్ కుమార్



సీతారామపురం, డిసెంబర్ 23(అక్షర వెలుగు)

మండలంలోని బాలాయపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం(నేడు) విపిఆర్ మొబైల్ నేత్ర ద్వారా అనుభవం కలిగిన వైద్యులచే, అత్యాధునిక పరికరాలతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతు ందని ఆయన ఓ ప్రకటనలో తెలి పారు. సందర్భంగా ఆయన మాట్లా డుతూ... ప్రజా సేవలో మరో ముందడుగు వేస్తూ విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో మన మండలంలోని గ్రామాల్లో విపిఆర్ నేత్ర ను ప్రారంభించారని, ఇప్పటివరకు మండలంలో ఒక పంచాయతీలలో కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పేద ప్రజల కంటి చూపు సమస్యలను అక్కడకక్కడే పరిష్కారం చూపుతూ అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేస్తూ విపిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహోన్నత మైన కార్యక్రమానికి విపిఆర్ దంపతులు శ్రీకారం చుట్టారని తెలిపారు . ఈరోజు బాలాయపల్లి సచివాలయం వద్ద ఈ ప్రాంత ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని కావున ప్రజలు ఈ సదవకాశాన్ని సద్విని చేసుకోవాలని ఆయన కోరారు.

Edited, Printed, Published & owned by PRUDHVIRAJU G , Published From, Abdullapurmet, Rangareddy Dist-501505, Hyderabad, Telangana State. Printed at GPR PUBLICATIONS. Abdullapurmet, Rangareddy Dist-501505, Hyderabad, Telangana State, Editor: PRUDHVIRAJU G, RNI: TELTEL/2022/83798, Cell:9581442622 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com